బాధితుడికి మాజీ మంత్రి పరామర్శ

బాధితుడిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్/పెబ్బేరు, ఆగస్టు 13: జిల్లా కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మన్నెయచారి కుమారుడు రాజశేఖర్ ప్రమాదానికి గురై సుదా నర్సింగ్ హోం లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మంగళవారం సుదా నర్సింగ్ హోమ్‌కు వెళ్లి బాధితుడిని పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. అలాగే కల్వరాల బీఆర్ఎస్ అధ్యక్షుడు సర్దార్ మియా కుమారులు రషీద్, ముజీబ్ పెబ్బేరులో నిర్వహిస్తున్న వెల్డింగ్ దుకాణాన్ని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పట్టణ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, ఎల్లయ్య, విశ్వరూపం, వెంకటన్నగౌడ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా యువకులను అభినందించారు. ఆయనతో బీఆర్ఎస్ నాయకులు మాణిక్యం, పరంజ్యోతి, చిట్యాల రాము, మహేశ్వర్‌రెడ్డి, గులాం ఖాదర్, నీలస్వామి, నర్సింహ, గౌడనాయక్, సుధాకర్‌రెడ్డి, కరుణాకర్ ఉన్నారు.

పోలీస్ సిబ్బందిని అభినందించిన ఎస్పీ

పోలీస్ సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ గిరిధర్

వనపర్తి టౌన్, ఆగస్టు 13: జిల్లాలోని పెబ్బేరు పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగలను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని మంగళవారం ఎస్పీ రావుల గిరిధర్ శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెబ్బేరు బస్టాండ్ సమీపంలో సోమవారం రాత్రి పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి దుకాణం ఎదుట అనుమానాస్పదంగా తిరుగుతుండగా.. పోలీసులను చూసి పారిపోయాడు. అనుమానం వచ్చి షాపును పరిశీలించగా షాపు షెటర్ కొద్దిగా తీసి ఉంచడంతో అక్కడికెళ్లి చూడగా లోపల ఇద్దరు దొంగతనం చేస్తుండగా పోలీసులు పట్టుకొని ఠాణాలో అప్పగించారు. దీంతో డ్యూటీలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ రాములునాయక్, కానిస్టేబుల్ రవికుమార్, హోంగార్డ్ కరుణాకర్‌గౌడ్, డ్రైవర్ మహేశ్‌ను ఎస్పీ అభినందించారు. అభినందించినవారిలో అదనపు ఎస్పీ రామదాస్ తేజావత్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీముని, ఆర్ఐ అప్పలనాయుడు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

జూరాలను సందర్శించిన అదనపు కలెక్టర్

ప్రాజెక్టు వద్ద వరద వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ నాగేశ్

అమరచింత, ఆగస్టు 13: మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును అదనపు కలెక్టర్ నాగేశ్, ఎస్‌డీసీ వెంకటేశ్వర్లతో కలిసి మంగళవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రాజెక్టు పరిసరాలను కలియతిరిగి పరిశీలన చేసి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను వరద గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట తాసీల్దార్ రమేశ్‌రెడ్డి, అధికారులు ఉన్నారు.

బొంకూరులో వైద్య బృందం

బొంకూరులో వైద్యసేవలు చేస్తున్న డాక్టర్లు

ఉండవెల్లి ఆగస్టు 13: జిల్లా అధికారి ఆదేశాల మేరకు మండలంలోని బొంకూరులో సెల్లు లైటీస్‌తో బాధపడుతున్న వారిని వైద్యాధికారి ప్రసన్నరాణి, ఇతర వైద్యసిబ్బంది పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో కాళ్లు, చేతులకు సెల్లు లైటీస్‌తో బాధపడుతున్న భీమేశ్వరావు, నర్సింహ, లక్ష్మీదేవమ్మ, సుశీలమ్మతో పాటు మరికొంత మందికి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ యాకుబ్, మధుసూదన్, వైద్యసిబ్బంది నర్సయ్య, చంద్రన్న, ఏఎన్ఎం రాణి, ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

వనపర్తి టౌన్, ఆగస్టు 13: జిల్లా కేంద్రానికి చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మహేశ్, వైస్ చైర్మన్ కృష్ణయ్య ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి చెక్కులు పంపిణీ చేశారు. మున్సిపాలిటీలోని 6,15,17, 22, 25, 27, 28, 30వ వార్డుల్లో మొత్తం 32చెక్కులను అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకటేశ్, నక్కరాములు, సత్యంసాగర్, సుమిత్ర, చంద్రకళ, సత్యమ్మ, జంపన్న, నారాయణ, సతీశ్‌కుమార్, చందర్ ఉన్నారు.

‘స్వచ్ఛదనం–పచ్చదనం’ నిరంతర ప్రక్రియ

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి అనసూయ
- కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్
- స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంపై సమీక్ష

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ ఆదర్శ్ సురభి ఇతర అధికారులు

వనపర్తి టౌన్, ఆగస్టు 13: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని మున్సిపాలిటీలు, పంచాయతీలు నిరంతరం కొనసాగించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి అనసూయ(సీతక్క) సూచించారు. మంగళవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామాలు, మున్సిపాలిటీల్లో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు క్రమం తప్పకుండా గ్రామాలను సందర్శించి జీపీలు పరిశుభ్రంగా ఉండేవిధంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. అవసరమైన పంచాయతీల్లో నిధులు విడుదల చేస్తామన్నారు. ఇందిర మహిళా శక్తి పథకం కింద ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో ఎవరైనా స్వయం సహాయక బృందాలు సభ్యత్వం లేనివారిని గుర్తించి సభ్యత్వంలో చేర్పించాలని సూచించారు. స్వయం సహాయక మహిళా సంఘాలు ఆర్థిక స్వాలంభనకు శిక్షణ ఇచ్చి చిన్నచిన్న పరిశ్రమలు నెలకొల్పే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఆగస్టు 5నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని మంచిగా నిర్వహించిన మండలాలు, జీపీలను గుర్తించి స్వాతంత్ర్య దినోత్సవంలో ప్రశంసా పత్రాలు ఇవ్వాలని సూచించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యం, ఫ్రైడే డ్రైడేను కొనసాగించాలని అధికారులకు సూచించారు. చెత్తను రోడ్లపై, బయట వేసే వారిని గుర్తించి జరిమానా విధించాలని డీపీవోను ఆదేశించారు. గ్రామ రహదారి పొడవునా లేఅవుట్ ఖాళీ స్థలంలో మొక్కలు నాటించాలని ఆదేశించారు. మహిళా శక్తి కింద తండాల సభ్యులకు శిక్షణ ఇచ్చి యూనిట్లను నెలకోల్పేవిధంగా ప్రోత్సహించాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీఆర్డీవో ఉమాదేవి, జెడ్పీ సీఈవో యాదయ్య, డీపీవో రమణమూర్తి, అదనపు డీఆర్డీవో నాగేంద్ర, డాక్టర్ సాయినాథ్, డీఎల్పీవో రఘునాథ్ తదితరులు ఉన్నారు.

ఆక్సిజన్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలి

వనపర్తి టౌన్, ఆగస్టు 13: ప్రభుత్వ దవాఖానలో చేపడతున్న మరమ్మతు పనులను పూర్తిచేసి ఆక్సిజన్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖాన పరిసరాలతోపాటు మార్చురీ, కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఆక్సిజన్ ప్లాంట్, స్టాఫ్ గదులను పరిశీలించారు. మరమ్మతు పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రంగారావు, వైద్యసిబ్బంది శివ, సాధిక్ తదితరులు ఉన్నారు.

దవాఖాన పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల అర్బన్, ఆగస్టు 13: జిల్లాలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సరోజ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె తెలియజేస్తూ ఎస్సీ విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు ఆర్థిక సాయం అందించేందుకు TOFEL, GRE, GMAT, IELTSలో ఉత్తీర్ణత సాధించినవారు అర్హులన్నారు. యూకే, యూఎస్ఏ, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ, జపాన్, ఫ్రాన్స్, న్యూజిలాండ్, సింగపూర్‌లోని విశ్వవిద్యాలయాల్లో చదువుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 14వ తేదీ నుంచి అక్టోబర్ 13వ తేదీవరకు సంబంధిత ధృవపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

స్వచ్ఛమైన నీటిని అందించాలి

గద్వాలటౌన్/ గద్వాల రూరల్, ఆగస్టు 13: ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని జములమ్మ ఫిల్టర్‌బెడ్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ దశరథ్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల వర్షాల కారణంగా తాగు నీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఫిల్టర్‌బెడ్‌ను శుభ్రం చేయాలని చెప్పారు. అలాగే ఫిల్టర్‌బెడ్ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలన్నారు. తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. అలాగే జమ్ములమ్మ దేవతను దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి వస్త్రాలతో చైర్మన్‌ను సన్మానించారు.

మెడికల్ విద్యార్థినికి ఆర్థికసాయం

ఖిల్లాఘణపురం, ఆగస్టు 13: మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని మెడికల్ సీటు సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తు మంగళవారం మాజీ సర్పంచ్ ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన విద్యార్థిని మెడికల్ సీటు సాధించడం సంతోషించదగ్గ విషయమని, ఆమె విద్యకు తోడ్పాటునందించేందుకు రూ.10వేల ఆర్థికసాయం అందజేసినట్లు పేర్కొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

పాన్‌గల్, ఆగస్టు 13: ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కేతూరి శ్రీరాం అన్నారు. మంగళవారం మండలంలోని కేతేపల్లిలో సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇల్లు, ఇండ్ల స్థలాలు, రేషన్‌కార్డులు, పింఛన్లు, సీసీరోడ్లు, విద్యుత్ సమస్యల పరిష్కారంపై సీపీఐ కార్యకర్తలు పోరాడాలని కోరారు. కేఎల్ఐ, భీమా కాల్వల్లో పేరుకుపోయిన మట్టి, జమ్మును తొలగించాలని కోరారు. కేతేపల్లిని మండల కేంద్రం, ప్రాథమిక ఆరోగ్యం, బైపాస్‌రోడ్డు, పెండింగ్‌లో ఉన్న బిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుర్మయ్య, పెంటయ్య, పెద్దహనుమంతు, చిన్ననారాయణ పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

పాన్‌గల్, ఆగస్టు 13: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎంపీపీ నారాయణ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని జూనియర్ కళాశాల, బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు రూ.వేయి చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యంతో చదవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ఖిల్లాఘణపురం, ఆగస్టు 13: మండల కేంద్రానికి చెందిన ఒంటరి మహిళ పానుగంటి నాగమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ వెంకటరమణ నాగమ్మ అంత్యక్రియలకు రూ.20వేలు, ఘణపురం జీపీ తరపున మండల ప్రత్యేకాధికారి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి, సిబ్బంది, హరిజన్‌వాడ కాలనీవాసులు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలి

- జోగులాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

గద్వాల, ఆగస్టు 13: వసతి గృహ విద్యార్థులకు ఈనెల 16 నుంచి బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని కలెక్టర్ సంతోష్ వసతి గృహ నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో చదువుతున్న 3వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులను బాగా చదివించి వారి సామర్థ్యాలను పరిశీలించాలని సూచించారు.

భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ప్రతి విద్యార్థికి మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వంట గదులు, భోజనశాల, మరుగు దొడ్లను పరిశీలించారు. మరుగుదొడ్లను ఎప్పటి కప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులను తరగతుల వారీగా విభజించాలన్నారు. వసతి గృహాలకు అవసరమైన తలుపులు, కిటికీల మరమ్మతులు చేపట్టాలన్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. ఎన్నికల అవసరాలకు నిర్మూలించిన గోడలు వెంటనే పునర్నిర్మించాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఇందుకు అవసరమైన నిధులు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. పనులు వచ్చే 15రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ప్రిన్సిపాల్ కలందర్‌పాషా, అధికారులు ప్రగతి, రమేశ్‌బాబు, సరోజ, దామోదర్‌రావు, కళాశాల కమిటీ సభ్యుడు సాయిశ్యాంరెడ్డి, వార్డెన్లు ఉన్నారు.

ఆలయాలను దర్శించుకున్న అదనపు కలెక్టర్

అలంపూర్, ఆగస్టు 13: జోగులాంబ, బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను అదనపు ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసరావు దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ దంపతులకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం జోగులాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవో పురేందర్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ శ్రీనివాసరావు దంపతులకు స్వాగతం పలుకున్న ఈవో పురేందర్‌కుమార్

విత్తనోత్పత్తి రైతులకు బకాయిలు చెల్లిస్తాం

- రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి

వనపర్తి టౌన్, ఆగస్టు 13: విత్తనాలు ఉత్పత్తి చేసే రైతులకు బకాయిలు వెంటనే చెల్లిస్తామని రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని విత్తన శుద్ధి కార్మాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. వనపర్తి జిల్లాలో విత్తనోత్పత్తి కోసం ఎంతో పట్టుదలతో 1993లో ప్రస్తుత రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఏర్పాటు చేయించారని, 2013లో భవనాల నిర్మాణం చేశారని గుర్తు చేశారు. విత్తనోత్పత్తి రైతుల సమస్యలను తీర్చడానికి అధికారులతో కలిసి ఇక్కడికి వచ్చామన్నారు. ప్రైవేట్ కంపెనీలు నాణ్యవంతమైన విత్తనాలు త యారు చేయకపోతే వారిదే బా ధ్యత అని, పదేండ్లుగా నిరంతరం రైతుల సమస్యలు, రైతుబాగు కోసం పోరాడుతున్నామన్నారు. మార్కెట్ ధరకన్నా త క్కువ ధరకు విత్తనాలు అం దించే ప్రయత్నం చేస్తున్నామని, కార్పొరేషన్ అందించే విత్తనాలను రైతులు కొనుగోలు చేయాలని, రైతులకు మంచి చేయడానికే కార్పొరేషన్ అంతిమ లక్ష్యమన్నారు. రైతులకు చెల్లించే సమయంలో హమాలీ ఖర్చుల భారం పడకుండా చూస్తామన్నారు. ఒక్కో సీజన్‌లో ఒక్కో రకమైన పంటలు పండిస్తున్నారని, ఆ జిల్లాలకు అనుగుణంగా నాణ్యమైన విత్తనాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో విత్తన కార్పొరేషన్ మేనేజర్ సంధ్యారాణి, మార్కెటింగ్ మేనేజర్ ఆదినారాయణరెడ్డి, వనపర్తి జిల్లా కిసాన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, ఉమ్మడి జిల్లా విత్తన కార్పొరేషన్ అధికారులు తదితరులు ఉన్నారు.

విత్తన శుద్ధి కార్మాగారంలో విత్తనాలను పరిశీలిస్తున్న చైర్మన్ అన్వేశ్‌రెడ్డి

ప్రథమ చికిత్స కేంద్రం సీజ్

ఎర్రవల్లి, ఆగస్టు 13: మండలంలోని కొండేరులో ఆర్ఎంపీలు నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాలను జిల్లా వైద్యాధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి సీజ్ చేశారు. జిల్లా మాతాశిశు సంరక్షణ అధికారి ప్రసన్నరాణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డితో కలిసి ప్రథమ చికిత్స కేంద్రాలను తనిఖీ చేయగా.. ఆర్ఎంపీలు మోహన్, రమేశ్ వద్ద యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్, పెయిన్ కిల్లర్స్, క్యాల్షియం ఇంజక్షన్స్, బీ–కాంప్లెక్స్ ఇంజక్షన్స్, చిన్నపిల్లలకు ఇచ్చే సిరప్స్, ఆస్తమా రోగానికి సంబంధించిన మందులు, వివిధ ప్రైవేట్ దవాఖానలకు సంబంధించిన రెఫరల్ స్లిప్పులు, ఐవీ స్టాండ్, బెడ్స్ ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా రక్త పరీక్షలకు దగ్గరలోని ల్యాబ్‌కు రోగులను రెఫర్ చేసి వైద్యం అందిస్తున్నట్లు వైద్యాధికారులు నిర్ధారించారు. ప్రథమ చికిత్సలు చేయాల్సిన ఆర్ఎంపీలు అన్నిరకాల వ్యాధులకు చికిత్స అందిస్తున్నట్లు అధికారులు గుర్తించి మోహన్ ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేసి జిల్లా అధికారులకు నివేదిక అందించినట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు.

మొక్కజొన్న పంట సాగుపై అవగాహన

మల్దకల్, ఆగస్టు 13: మొక్కజొన్న, మినుములు పంటలసాగుపై రైతులకు టెలికాన్ఫరెన్స్‌లో శాస్త్రవేత్తలు మంగళవారం అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటలపై శాస్త్రవేత్తలు సలహాలు, సూచినలిచ్చారు. కార్యక్రమానికి డీఏవో గోవింద్‌నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు భద్రు, శ్రీదేవి మొక్కజొన్న, మినుము పంటల సాగుపై వివరించారు. డీఏవో మొక్కజొన్న రకాలు, వాటి లభ్యతపై శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏవో రాజశేఖర్, ఏఈవో రాహుల్, ఖాజా, ఆయా గ్రామాల ఏఈవోలు పాల్గొన్నారు.

జూరాల కాల్వలోపడి మహిళ మృతి

ఇటిక్యాల, ఆగస్టు 13: మండలంలోని జూరాల ఆయకట్టు సోమనాద్రి ప్రధాన కాల్వలో పడి మహిళ మృతి చెందిన ఘటన చోటుచేసుకున్నది. స్థానికులు, గ్రామస్తుల కథనం మేరకు నక్కలపల్లెకు చెందిన తెలుగు మద్దమ్మ(55) రెండు రోజుల కిందట ఇల్లు విడిచి వెళ్లింది. అయితే మంగళవారం గ్రామ సమీపంలోని జూరాల ప్రధాన కాల్వలో మృతదేహమై తేలింది. అనారోగ్యంతోనే ఆమె మృతిచెంది ఉండవచ్చని గ్రామస్తులు తెలిపారు.

రెండుచోట్ల చోరీలు

వడ్డేపల్లి, ఆగస్టు13: మండలలోని జూలేకల్ స్టేజీ వద్ద భాస్కర్ కిరాణం దుకాణంలో సోమవారం రాత్రి షట్టర్ పగలగొట్టి దుండగులు చోరీకి పాల్గొడ్డారు. షాపులో కొన్ని సరుకులతోపాటు రూ.10వేల నగదుకుపైగా ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అలాగే శాంతినగర్‌లోని టీటైం టీస్టాల్ షట్టర్‌ను పగలగొట్టి కొంత సామగ్రి, రూ.3వేలకు నగదు చోరీ చేసినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న ఎస్సై సంతోష్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. జూలేకల్, శాంతినగర్‌లో సమీపంలో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించారు. క్లూస్ టీం నుంచి కూడా సమాచారం సేకరిస్తున్నారని ఎస్సై తెలిపారు.

ఆటో, బైక్ ఢీ: ఇద్దరికి గాయాలు

గట్టు, ఆగస్టు 13: మండలంలోని తుమ్మలపల్లి స్టేజీ వద్ద కర్నూలు–రాయిచూర్ రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న ఆటో, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన మంగళవారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. అయిజ నుంచి చాగదోణ వైపు వెళ్తున్న బైక్, బలిగేర నుంచి డ్రిప్పు పైపులతో వస్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనలో ఏపీ బెలగల్ మండలానికి చెందిన కుమ్మరి నాగేశ్, కుమ్మరి వాసుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను కర్నూలు దవాఖానకు తరలించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై కేటీ మల్లేశ్ తెలిపారు.

పుస్తెలతాడు అపహరణ

పెబ్బేరు, ఆగస్టు 13: ఓ మహిళ దృష్టిని మళ్లించిన అగంతకుడు పుస్తెలతాడు లాక్కెళ్లిన ఘటన రంగాపురంలో చోటుచేసుకున్నది. ఎస్సై హరిప్రసాదరెడ్డి కథనం ప్రకారం.. మందడి పద్మ బస్టాండ్ సమీపంలో ఓ దుకాణంలో లేడీస్ కార్నర్ నిర్వహిస్తోంది. సోమవారం రాత్రి ఓ వ్యక్తి వచ్చి చైన్లు ఉన్నాయా అని అడిగాడు. ఆమె చూపించేందుకు కిందకు వంగినప్పుడు మెడలోని నాలుగు తులాల పుస్తెలతాడు లాక్కొని బైకుపై పారిపోయాడు. ఘటనా స్థలాన్ని వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, కొత్తకోట సీఐ రాంబాబు సందర్శించారు. చోరీ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కూలిన మట్టిమిద్దె

పెబ్బేరు, ఆగస్టు 13: మండలంలోని గుమ్మడంలో మంగళవారం ఓ ఇంటి పైకప్పు అకస్మాత్తుగా కూలింది. ఇంటి యజమాని మద్దెరి శారదమ్మ ఆ సమయంలో ఇంటి బయట ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పింది. భర్త చనిపోవడంతో ఆమె కుమారుడితో సహా ఆ ఇంట్లో నివసిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు బాగా నానడంతో ఉన్నట్లుండి మిద్దె కూలినట్లు, ఆమెకు ప్రభుత్వం డబుల్ బెడ్రూం మంజూరు చేయాలని కోరుతున్నారు.

దౌర్జన్యం చేసిన వారిపై కేసు నమోదు

- భూ వివాదానికి తెరలేపిన నలుగురు వ్యక్తులు
- పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

మదనాపురం, ఆగస్టు 13: కొత్తకోట మండలంలోని కనిమెట్టకు చెందిన ఓ రైతు వ్యవసాయ పొలంలో వరి నాటు వేసే పనులకు ఆటంకం కల్పిస్తూ మంగళవారం కొందరు దౌర్జన్యం చేయడంతో వారిపై కొత్తకోట ఠాణాలో కేసు నమోదైంది. కనిమెట్టకు చెందిన రాజవర్ధన్‌రెడ్డి తన పొలంలో వరి నారుమడి కోసం ట్రాక్టర్ ద్వారా పని చేయించుకుంటున్నాడు. పనులు చేసుకోకుండా అదే గ్రామానికి చెందిన పేరి జగదీశ్వర్‌రెడ్డి, పేరి శేఖర్‌రెడ్డి, పేరి క్రుపాకర్‌రెడ్డి, కన్నా ట్రాక్టర్‌కు అడ్డంగా వెళ్లి దౌర్జన్యం చేశారు. ఈ పొలం మాకు వస్తుందని దౌర్జన్యంగా రాజవర్ధన్‌రెడ్డిని వెంబడించి రాయితో దాడిచేసి గాయపరిచారు. దీనిపై రాజవర్ధన్‌రెడ్డి పోలీసులకు సమాచారమిచ్చి దాడిపై ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు 341, 324 సెక్షన్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గాయపడిన రాజవర్ధన్‌రెడ్డిని వనపర్తి ఏరియా దవాఖానకు చికిత్స కోసం పోలీసులు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా

ఖిల్లాఘణపురం, ఆగస్టు 13: ఇసుక ట్రాక్టర్ బోల్తాపడిన ఘటన మండలంలోని మానాజీపేటలో చోటుచేసుకుంది. అంతాయపల్లి నుంచి మానాజీపేటకు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ఎవరికీ ప్రమాదాలు కాకపోవడంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు.

ఘనంగా కేఎస్‌పీవీ వార్షికోత్సవం

కొత్తకోట, ఆగస్టు 13: పట్టణంలోని క్రైస్తవ సామాజిక పరిరక్షణ తెలంగాణ రాష్ట్ర కమిటీ 6వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు జనుంపల్లి సిమియసోన్ మాట్లాడుతూ.. క్రైస్తవుల అభివృద్ధి, సంక్షేమం కోసం నిధులు కేటాయించి ఆదుకోవాలన్నారు. అనంతరం పాస్టర్లు సుందర్, ప్రభుదాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సంజీవ, చంద్రబాబు, నవీన్‌కుమార్, పౌలు, శాంతిప్రసాద్, రవి పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, Govindahalli Village కి చెందిన E. Yadagiri S/o Ramulu, aged 38 years, Occ: Business, R/o H.No.3-9, Govindahalli Village, Madanapuram Mandal, Wanaparthy Dist., **Applicant / Borrower,** Smt. Eruga dindla Bhargavi W/o Yadagiri, aged 35 years, Occ: House wife, R/o H.No.3-9, Govindahalli Village, Madanapuram Mandal, Wanaparthy Dist., **Co-Applicant / Property holder** నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, మహబూబ్‌నగర్ బ్రాంచ్-2 గారికి ఇట్టి ఆస్తిని తనఖా (Mortgage) పెట్టి అప్పు తీసుకోవటానికి దరఖాస్తు చేసియున్నారు. ఇట్టి ఆస్తి విషయములో ఎవరికైనా ఎలాంటి హక్కుగాని, ఆక్షేపణలు గాని ఉన్నయెడల ఈ క్రింది అడ్రస్సుకు (3) రోజుల లోపల తెలియజేయగలరు. లేని పక్షంలో ఇట్టి ఆస్తిపై ఎలాంటి అభ్యంతరములు లేవని భావించి నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, మహబూబ్‌నగర్ బ్రాంచ్-2 వారు షెడ్యూల్ ఆస్తిని తనఖా పెట్టుకొని అప్పును మంజూరు చేయుదురు. తరువాత వచ్చిన ఆక్షేపణలు చెల్లనేరవు.

SCHEDULE OF THE PROPERTY:

All that the part and parcel of Open plot No.116 total extent 133.33 Sq.Yards, in Sy.No.447/A, 447/AA, situated within the limits of Kotha kota Village & Mandal, Wanaparthy Dist. **Bounded by: East:** 20 ft. Road, **West:** 20ft. Road, **North:** Plot No.115, **South:** Plot No.117.

K. CHANDRA MOULI, B.Com., LLB
Advocate, New Gunj, Hanuman Nagar, Mahabubnagar. Cell: 9440330760

పరిరక్షణ కమిటీలు కీలక బాధ్యత వహించాలి

- బాలల సంక్షేమ జిల్లా అధికారిని సుధారాణి

గద్వాల రూరల్, ఆగస్టు 13: బాలల సంరక్షణకు వారి హక్కులను రక్షించడంలో బాలల పరిరక్షణ కమిటీలు కీలక బాధ్యత వహించాలని జిల్లా బాలల సంక్షేమ అధికారిని సుధారాణి తెలిపారు. మంగళవారం మండలంలోని పూడూర్‌లో బాలల సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె పాల్గొని బాలల లైంగిక వేధింపుల నిరోధక చట్టం గురించి తెలియజేశారు. లైంగిక వేధింపులకు గురైతే 100, 1098కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీపీవో నర్సింహులు, సీడీపీవో వెంకటేశ్వరి, సూపర్‌వైజర్ పద్మావతి, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ శివలీల, హెడ్‌కానిస్టేబుల్ శేఖర్, కార్యదర్శి శేఖర్, ఏఎన్ఎం వనిత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలు బడిలోనే ఉండాలి

అయిజ, ఆగస్టు 13: బడీడు పిల్లలు బడిలో ఉండాలని ఎస్సై విజయ్ భాస్కర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పలలో బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ .. బాలబాలికలు ఎలాంటి సమస్య వచ్చినా కమిటీ సభ్యులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బలరాం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎల్లమ్మ, శిశు, సంక్షేమశాఖ ఔట్‌రీచ్ వర్కర్ ప్రకాశ్, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వడ్డేపల్లి మండలంలో..

వడ్డేపల్లి, ఆగస్టు13: బడీడు పిల్లలను బడికి పంపాలని జీహెచ్ఎం వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. శాంతినగర్‌లో మంగళవారం జీహెచ్ఎం ఆధ్వర్యంలో జెడ్పీహెచ్ఎస్‌లో ఎంవీ ఫౌండేషన్, మహిళా శిశు సంక్షేమశాఖ వారు బడీడు పిల్లలను బడిలో చేర్చాలని కోరుతూ ముద్రించిన వాల్‌పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయరాదని వివరించారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ హనిమిరెడ్డి, ఉపాధ్యాయులు శామ్యూల్, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మద్దెలబండలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నాగరాణి

మద్దెలబండలో..

మల్దకల్, ఆగస్టు 13: మండలంలోని మద్దెలబండలో మంగళవారం మహిళా శిశుసంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అంగన్‌వాడీ సూపర్‌వేజర్ నాగరాణి, కౌన్సిలర్ సురేశ్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, హెచ్ఎం రేణుక, ఎస్ఎంసీ చైర్మన్ శీలమ్మ, దేవమ్మ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి మండలంలో..

కేటీదొడ్డి, ఆగస్టు 13: మండలంలోని గువ్వలదిన్నెలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కవిత, పద్మ, నాగలక్ష్మి, నజియా, లక్ష్మి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యావలంటీర్లను నియమించాలి

కేటీదొడ్డి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం విద్యా వలంటీర్లను నియమించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక మండల కన్వీనర్ యుగేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన మండల స్థాయి బాలల హక్కుల పరిరక్షణ సభుయల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 36 పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిందని, ఉపాధ్యాయులు చాలా వరకు తక్కువగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కో–కన్వీనర్ బడేసాబ్, వీరన్న, సవిత, సరోజ, సుశీలమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.